రైళ్లు ఆగని రైల్వేస్టేషన్!

- కరోనా సమయంలో కొన్ని రైళ్ల హాల్టింగ్ ఎత్తివేత
- ఆధునికీకరణ పనులతో ఒక్క రైలు కూడా ఆగని వైనం..
- అలంకారప్రాయంగా మారిన రేచినిరోడ్ రైల్వేస్టేషన్
- ఇబ్బంది పడుతున్న రైలు ప్రయాణికులు


నిర్మాణం పూర్తయిన నూతన భవనం

తాండూర్: ఆధునికీకరణ పనుల్లోని అలసత్వం రైలు ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. మరమ్మతు పనులు నత్తనడకన సాగుతుండడంతో ప్రయాణికులు పడరాని పాట్లు పడుతున్నారు. నిర్మాణ పనుల పేరిట రైలు సేవలు నిలిచిపోవడంతో ప్రజలకు ప్రయాణ కష్టాలు తప్పడం లేదు. దీంతో తాండూర్ మండలంలోని రేచిని రోడ్ రైల్వేస్టేషన్ అలంకార ప్రాయంగా మారింది.

ఆధునికీకరణ సరే... అందుబాటులోకి ఎప్పుడు...?

రైల్వేశాఖ దేశ వ్యాప్తంగా రైల్వేస్టేషన్‌ల ఆధునికీకరణకు శ్రీకారం చుట్టింది. అందుకు అనుగుణంగా పనుల మంజూరు, టెండర్ ప్రక్రియను శరవేగంగా పూర్తి చేసింది. ఇందులో భాగంగా రేచిని రోడ్ రైల్వేస్టేషన్‌లో సుమారు రూ.4కోట్ల అంచనాతో నూతన భవన నిర్మాణాలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం, నూతన ఫ్లాట్‌ఫార్మ్‌లతో పాటు ఇతర అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయి. అంత వరకు బాగానే ఉన్నా నిర్మాణ పనుల ప్రక్రియ వేగవంతంగా జరగడం లేదు. నత్తనడకగా సాగుతున్న పనులతో ప్రయాణికులకు రైళ్ల సౌకర్యాలు దూరమయ్యాయి.

నో హాల్టింగ్.. నో జర్నీ..

కరోనా సమయం నుంచే రేచిని రోడ్ రైల్వేస్టేషన్‌లో దశల వారీగా కొన్ని రైళ్ల హాల్టింగ్‌లు ఎత్తివేశారు. ఇప్పుడైనా రైళ్ల హాల్టింగ్‌లను పునరుద్ధరిస్తారని ఆశ పడ్డ ప్రజలకు నిరాశే ఎదురవుతోంది. రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు కొంతకాలం నుంచి మందకొడిగా సాగుతుండటం, మరోపక్క మూడో లైన్ పనులు జరుగుతుండటంతో రైళ్ల హాల్టింగ్‌లను పునరుద్ధరించడం లేదు. రామగిరి, సింగరేణి, భాగ్యనగర్, పుష్పుల్, ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్ల సేవలు ప్రజలకు అందకుండా పోయాయి. దీంతో రైలు ప్రయాణం కోసం బెల్లంపల్లికి వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.


ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం వేసిన పిల్లర్లు

ఆగుతూ....సాగుతూ...

రేచిని రోడ్ రైల్వేస్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి ప్రధాన సమస్య. దశాబ్దాల నుంచి ఫుట్ ఓవర్ బ్రిడ్జి లేకపోవడం ప్రయాణికులకు శాపంగా మారింది. ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం రైలు ప్రయాణికుల దశాబ్దాల కల. రేచిని రోడ్ రైల్వేస్టేషన్ నుంచి రైలు ప్రయాణం చేయాలంటే రైళ్ల కింద నుంచి ప్రమాదకర పరిస్థితుల్లో దాటాల్సిన పరిస్థితి. అంతటి క్లిష్టమైన సమస్య నేటికీ పరిష్కారానికి నోచులేకపోతోంది. నాలుగేళ్ల క్రితం ఫుట్ ఓవర్ బ్రిడ్జి మంజూరైనప్పటికీ అనివార్య కారణాల వల్ల రద్దయింది. ఇటీవల మళ్లీ మంజూరు కాగా ప్రస్తుతం నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. బల్లార్షా నుంచి కాజీపేట వరకు పలుచోట్ల ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు మంజూరు చేశారు. ఒకే టెండర్‌లో ఇవన్నీ ఉండటంతో ఒక్కొక్కటి పూర్తయి రేచిని రోడ్ రైల్వే స్టేషన్‌లో పనులు మొదలు పెట్టే సరికి తీవ్ర జాప్యం ఏర్పడింది. ఈ పనులు పూర్తయ్యేందుకు ఇంకో నాలుగు నెలల సమయం పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో ఆలస్యంగా నైనా రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు కొనసాగుతుండడంతో రైలు ప్రయాణికుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నప్పటికీ, పనులు వేగంగా జరుగకపోవడంపై పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైల్వే ఆధునికీకరణ, స్టేషన్ మరమ్మతు, అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి రైళ్ల హాల్టింగ్‌లను పునరుద్ధరించి రైల్వే సేవలను అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

రైళ్ల హాల్టింగ్‌లు పునరుద్ధరించాలి



రేచిని రోడ్ రైల్వేస్టేషన్‌లో రైళ్ల హాల్టింగ్ లేకపోవడం వల్ల తాండూర్, తిర్యాణి, భీమిని మండలాల ప్రయాణికులు ఎక్కువ సంఖ్యలో బెల్లంపల్లి రైల్వేస్టేషన్ నుంచి ప్రయాణం సాగిస్తున్నారు. రైళ్ల హాల్టింగ్‌లను వెంటనే పునరుద్ధరించి రైలు ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలి.

– కామని శ్రీనివాస్, కిష్టంపేట, తాండూర్

ప్రజల సౌకర్యార్థం మరొక రైలు నడపాలి



తెల్లవారుజామున భాగ్యనగర్ రైలు తరువాత మధ్యాహ్నం ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైలుకు ముందు ప్రజల సౌకర్యార్థం మరొక రైలు నడపాలి. ఈ రెండు రైళ్ల మధ్య ఆరు గంటల వ్యవధిలో కాగజ్‌నగర్ నుంచి సికింద్రాబాద్‌కు రైళ్లు లేవు. రైళ్లను మళ్లీ ప్రారంభించడంతో పాటు ఇంకో రైలు నడిపితే బాగుంటుంది.

– ఫణికుమార్, తాండూర్

ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి



రేచిని రోడ్ రైల్వేస్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి. ఫుట్ ఓవర్ బ్రిడ్జి లేక వృద్ధులు, మహిళలు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బ్రిడ్జి నిర్మాణ పనుల్లో వేగం పెంచి త్వరితగతిన ప్రయాణికులకు అందుబాటులో తీసుకురావాలి.

– జగన్మోహన్, తాండూర్ జెడ్పీ

క్లుప్తంగా

ఘనంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీ అభినవ శబరిమలై అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. అష్టోత్తర శతకళశ పూజలతో పాటు, స్వామివారి మూల విరాట్టుకు పంచామృతాభిషేకాలు, వైభవోపేతంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు, గురుస్వామి చక్రవర్తుల పురుషోత్తమా చార్యులు, భక్తులు పాల్గొన్నారు.

పశువుల సంత వేలం వాయిదా

జన్నారం: మండలంలోని రేండ్లగూడ పశువుల సంత దరఖాస్తులు రాకపోవడంతో ఈ నెల 19కి వాయిదా వేసినట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ప్రకటించారు. శనివారం వేలం ఉండగా స్పెషల్ అధికారి శ్రీకాంత్‌తో పాటు మరికొందరు వేలం వేయడానికి వచ్చారు. కానీ ఒక్కరే డిపాజిట్ చేయడం వల్ల వేలం వాయిదా వేసినట్లు తెలిపారు.

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం

కోటపల్లి: మండలంలోని బామన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం బుచ్చన్న ఆధ్వర్యంలో విద్యార్థులకు తల్లిదండ్రుల సమక్షంలో గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం బుచ్చన్న మాట్లాడుతూ.. బాలికలకు చిన్ననాటి నుంచే గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించడం వల్ల లైంగిక వేధింపులకు గురికాకుండా ముందస్తు జాగ్రత్తలు పడతారన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ భాగ్య, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'కార్మిక సమస్యలు విస్మరిస్తున్న యాజమాన్యం'


మాట్లాడుతున్న సత్యనారాయణ

మందమర్రిరూరల్: సింగరేణి సంస్థను లాభాల బాటలోకి తీసుకొస్తున్న కార్మికులను యాజమాన్యం విస్మరిస్తుందని ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ ఆరోపించారు. ఏరియాలోని కేకే–5 గనిపై శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఏరియాలో నూతన బొగ్గు గనులను ఏర్పాటు చేయాలని, గత ఆర్థిక సంవత్సరం సంస్థకు వచ్చిన లాభాలను వెంటనే ప్రకటించాలని, కార్మికులకు సీఎంపీఎఫ్ చిట్టీలు అందజేయాలని, సంక్షేమంపై శ్రద్ధ వహించాలని, గనుల్లో రక్షణ చర్యలు పెంచాలని, గుర్తింపు కార్మిక సంఘం ధృవపత్రం అందజేయాలని తదితర సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు సుదర్శన్, రాజేశం, శ్రీనివాస్, సంపత్, శ్రీకాంత్ ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

జైపూర్: మండల కేంద్రంలో గల ఐకేపీ కార్యాలయంలో శనివారం మహిళా సంఘాల సభ్యులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారులు ముస్తఫా, డాక్టర్ శ్రావ్య ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ నెల 20న జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా ఆరోగ్యవంతమైన పిల్లల కోసం ప్రతీ ఒక్కరికి అల్బెండాజోల్ ట్యాబ్లెట్స్ వేయించాలన్నా రు. 19ఏళ్ల లోపు పిల్లలకు ఈ ట్యాబ్లెట్స్ వే యించాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో, ఆరో గ్యకేంద్రాల్లో వైద్యసిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. వర్షాకాలంలో వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం రాజ్‌కుమార్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

తాండూర్: అర్హులైన ప్రతీ లబ్ధిదారుడికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని తాండూర్ ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాల కోసం దరఖాస్తు చేసుకుని ఆన్‌లైన్ సమస్య తలెత్తిన వారి దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను శనివారం ఆయన పరిశీలించారు. ప్రతి ఒక్కరి దరఖాస్తు ఆన్‌లైన్ చేసి, పథకాలు వర్తించేలా చూస్తామన్నారు. ఇకపై ఆన్‌లైన్ ప్రక్రియ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిరంతరం కొనసాగుతుందని, లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

క్రీడల్లో అత్యున్నత స్థాయిలో రాణించాలి

- బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్


పరిచయం చేసుకుంటున్న ఏసీపీ, సీఐ

తాండూర్: గ్రామీణ స్థాయి క్రీడాకారులు క్రీడల్లో అత్యున్నత స్థాయిలో రాణించి పేరు ప్రఖ్యాతలు సాధించాలని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా శనివారం తాండూర్ సీఐ కుమారస్వామి ఆధ్వర్యంలో చేపట్టిన నాలుగు మండలాల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ పోటీలను ఏసీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో ఏసీపీ మాట్లాడుతూ.. క్రీడాకారులు అందివచ్చిన ప్రతీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతికూల పరిస్థితుల్లో సైతం రాణించేలా కష్టపడాలన్నారు. ఆటల్లో గెలుపోటములు సహజమైనప్పటికీ గెలుపే ధ్యేయంగా క్రీడల్లో పోరాటపటిమ కనబరచాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై కిరణ్‌కుమార్, సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

'మిషన్ భగీరథ' నీరు వచ్చేలా చూడండి


వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

జన్నారం: గ్రామంలో నీటి సమస్య తీవ్రంగా ఉందని, నీటికి ఇబ్బంది ఏర్పడుతుందని మిషన్ భగీ రథ నీరు వచ్చేలా చూడాలని కోరుతూ శనివారం చింతలపల్లి గ్రామ ప్రత్యేక అధికారి ఎంఈవో విజయ్‌కుమార్‌కు చింతలపల్లి గ్రామానికి చెందిన పలువురు యువకులు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో తాగునీరు, ఇంటి అవసరాలకు నీరు లేకపోవడంతో గ్రామ పంచాయతీ సిబ్బంది ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసినా, కొందరికి అందడం లేదని పేర్కొన్నారు. గ్రామంలో మిషన్ భగీ రథ పైపులు బాగు చేసి, నీరు సరఫరా అయ్యేలా చూడాలని గ్రామానికి చెందిన యువకులు బూరగడ్డ జగన్, శంకర్, మహేశ్, గంగాధర్, నగేశ్‌లు కోరారు.

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి

- మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్


మాట్లాడుతున్న ఏసీపీ ప్రకాశ్

మంచిర్యాలక్రైం: బక్రీద్ వేడుకలను ముస్లింలు ప్రశాంతంగా జరుపుకోవాలని మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్ కోరారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ముస్లిం పెద్దలతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. పండగ నిర్వహణపై ముస్లిం పెద్దలకు సూచనలు చేశారు. హిందూ, ముస్లింలు సోదరభావం కలిగి ఉండాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పండగ వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ బన్సీలాల్, సిబ్బంది పాల్గొన్నారు.

16వ వార్డులో నీటి సరఫరా నిలిపివేత

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డు అశోక్‌రోడ్డుకు వెళ్లే దారిలో రైల్వే డిపార్టుమెంట్ డ్రెయినేజీ నిర్మిస్తుండగా, తాగునీరు సరఫరా చేసే పైపులైన్ పగిలి పోయినందునా తాగునీటి సరఫరాకు ఆదివారం అంతరాయం ఏర్పడనుందని మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వార్డు ప్రజలకు ఒక్కరోజు తాగునీటి సరఫరాను నిలిపి వేయనున్నందునా, ప్రజలు సహకరించాలని కోరారు.

విద్యారంగ సమస్యలకు ఏఐఎస్‌బీ పోరాటం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

మంచిర్యాలఅర్బన్: విద్యారంగ సమస్యల కోసం ఏఐఎస్‌బీ నిరంతర పోరాటం చేస్తుందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాహుల్ అన్నారు. మంచిర్యాలలో శనివారం అఖిల భారత విద్యార్థి బ్లాక్ 74వ వార్షికోత్సవాలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌బీ జిల్లా కన్వీనర్ సన్నీగౌడ్, పట్టణ కార్యదర్శి సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: ఆలిండియా స్టూడెంట్ బ్లాక్ (ఏఐఎస్‌బీ) వార్షికోత్సవం పోస్టర్‌ను ఆ సంఘం శ్రేణులు శనివారం ఆవిష్కరించారు. వార్షికోత్సవాలను ఈ నెల 25న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేడుకలను విద్యార్థులు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్‌బీ బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు మనోహర్, కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.

'యువత చెడు వ్యసనాలకు బానిస కావొద్దు'

మందమర్రిరూరల్: యువత చెడు వ్యసనాలకు బానిక కావొద్దని మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి యువకులకు హితవు పలికారు. 'పోలీసులు మీ కోసం' భాగంగా శనివారం ఊరుమందమర్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్సై రాజశేఖర్‌తో కలిసి హాజరై మాట్లాడారు. దేశ భవిష్యత్ యువత చేతుల్లో ఉందని, చదువుల్లో రాణించి జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తెలిపారు. ఈ సందర్భంగా యువకులకు క్రీడా దుస్తులు, వాలీబాల్ కిట్ అందించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది గోపాల్, విశ్వనాథ్, శ్రావణ్, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

ఘనంగా ఫాదర్స్‌డే

మంచిర్యాలఅర్బన్: స్థానిక లక్ష్మీనగర్ శ్రీ చైతన్య పాఠశాలలో ఫాదర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు తండ్రులు హాజరయ్యారు. పాఠశాలలో నిర్వహించిన ఆటలో పాల్గొన్నారు. పిల్లల జీవితంలో తండ్రిపాత్రను ప్రిన్సిపాల్ అయూబ్ వివరించారు. ప్రాథమిక పాఠశాల ఇన్‌చార్జి అర్చన, ప్రీ ప్రైమరీ ఇన్‌చార్జి క్రిష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

జన్నారం: ఇటీవల రాష్ట్ర అవతరణ దినం సందర్భంగా పోలీస్ అదనపు డీజీ చేతుల మీదుగా రూ.20వేల నగదుతో పాటుగా, ఉత్తమ సేవా అవార్డు అందుకున్న కానిస్టేబుల్ నాసాని శ్రీనివాస్‌ను శనివారం అతడి స్నేహితులు, మున్నూరు కాపు సంఘం నాయకులు సన్మానించారు. రాష్ట్రస్థాయిలో అవార్డు పొందడం గర్వకారణమని పేర్కొన్నారు.

తీన్మార్ మల్లన్నను కలిసిన అరుణ్‌కుమార్

భీమారం: ఇటీవల జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను బీసీ స్టేట్ యూత్ ప్రెసిడెంట్ తంగళ్లపల్లి అరుణ్‌కుమార్ శనివారం హైదరాబాద్‌లో కలిసి శాలువాతో సన్మానించారు. ఈ మేరకు అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. బీసీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని మల్లన్నని కోరినట్లు తెలిపారు.

ముందు జాగ్రత్తలతోనే నులిపురుగుల నివారణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

బెల్లంపల్లిరూరల్: ముందస్తు జాగ్రత్తలు పాటించడంతోనే నులిపురుగులను నివారించవచ్చని తాళ్లగురిజాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు తమ్మడి ఎవంజలీన్, ఎంపీడీవో మహేందర్ అన్నారు. తాళ్లగురిజాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఈ నెల 20వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నులిపురుగులను నివారించడానికి 1 నుంచి 19సంవత్సరాల వయస్సు కలిగిన ప్రతి ఒక్కరికీ అల్బెండజోల్ మాత్రలు అందిస్తున్నట్లు తెలిపారు. నులిపురుగులను నివారిస్తే పిల్లల్లో రక్తహీనత తగ్గి పోషణ మెరుగుపడడంతో పాటు మానసిక, శారీరక అభివృద్ధి కలుగుతుందన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమష్టి కృషి చేయాలని సూచించారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్, హెచ్ఈవో సమ్మయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భానుమతి, సృజన, ఐకేపీ సీసీ సుందరేశ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'మున్సిపల్ అధికారుల అవినీతి బాగోతం'

చెన్నూర్: చెన్నూర్ మున్సిపల్ అధికారుల అవినీతికి అంతులేకుండా పోయిందని, ఇంటి పన్నుల వసూలులో మున్సిపల్ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు సుశీల్‌కుమార్ ఆరోపించారు. స్థానిక అయ్యప్పస్వామి ఆలయం సమీపంలో గల రిలయన్స్ ట్రెండ్స్ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెన్నూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ కుమారుని పేరు మీద ఉన్న రిలయన్స్ ట్రెండ్స్ కమర్షియల్ కాంప్లెక్స్‌కు మున్సిపల్ అధికారులు ఇంటి పన్ను 2024–25సంవత్సరానికి రూ.534 మాత్రమే వసూలు చేశారని ఆరోపించారు. సామాన్యుల పెంకుటిల్లుకు మున్సిపల్ అధికారులు రూ.వేలకు వేలు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. చైర్‌పర్సన్ కుమారిని ఇంటి పన్ను తగ్గించడంలో మున్సిపల్ అధికారులు అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. కలెక్టర్ చెన్నూర్ మున్సిపల్ అధికారుల అవినీతి బాగోతంపై విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, బానేశ్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్..

ఇంటి పన్నుల వసూళ్లలో మున్సిపల్ అధికారులు అవినీతికి పాల్పడుతున్నారని చేస్తున్న ఆరోపణలో నిజం లేదు. రిలయన్స్ ట్రెండ్స్‌కు రూ.534 వసూలు చేశామని చూపిస్తున్నది తప్పుడు రసీదు. మున్సిపల్ చైర్‌పర్సన్ కుమారుడు రోహిత్ గిల్డా పేరున సాధారణ ఇల్లు ఉంది. ఆ ఇంటికి సంబంధించి వసూలు చేసిన ఇంటి పన్ను రసీదును చూపిస్తూ, తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. రిలయన్స్ ట్రెండ్స్ ఇంటి పన్ను 2024–2025కు గాను రూ.83,146 వసూలు చేసినట్లు తెలిపారు. సరైన ఆధారాలతో ఆరోపణలు చేస్తే బాగుంటుదని తెలిపారు.

అసంపూర్తిగా కేజీబీవీ పనులు


వివరాలు సేకరిస్తున్న సెక్టోరల్ అధికారి



కొనసాగుతున్న పనులు

భీమిని: స్థానిక కేజీబీవీ పాఠశాలలో అమ్మ ఆదర్శ పనుల్లో భాగంగా చేస్తున్న నిర్మాణ పనులు అసంపూర్తిగా మారాయి. దీంతో విద్యార్థులు అందులో ఉండలేక వెనుదిరిగి వెళ్తున్నారు. పాఠశాల మరమ్మతుల కోసం అమ్మ ఆదర్శ పాఠశాల కింద ఎలక్ట్రిషియన్, డ్రింకింగ్‌వాటర్, టాయిలెట్స్, ఇతర సౌకర్యాల కోసం రూ.8లక్షల 45వేలతో పనులు ప్రారంభించారు. కానీ అవి అసంపూర్తిగా నిలిచిపోయాయి. పాఠశాల పునఃప్రారంభానికి ముందే పనులు పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ, కేజీబీవీ ప్రత్యేక అధికారిని కవిత, వీవో అధ్యక్షురాలు విమల మధ్య సమన్వయ లోపంతో ఈ పనులు ఆలస్యమవుతున్నట్లు తెలుస్తోంది. దీంతో విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారు. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలియడంతో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు సెక్టోరల్ అధికారి సత్యనారాయణ శనివారం పనులు ఆలస్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. నాలుగు రోజుల్లో పనులు పూర్తి అయ్యే విధంగా చూడాలని ఆదేశించారు.

ఆదర్శంగా తీసుకోవాలి

శ్రీరాంపూర్: రక్తదానం చేసి గవర్నర్ ప్రశంసలు అందుకున్న వీటీసీ హెడ్ ఓవర్‌మెన్ రాజ్ కుమార్‌ను యువ ఉద్యోగులు ఆదర్శంగా తీసుకోవా లని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. శనివారం జీఎం కార్యాలయంలో జీఎం ఆయన్ను సన్మానించారు.

హరిత లోగిళ్లు...!


దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏపుగా పెరిగిన చెట్లు


దండేపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద చెట్ల నీడన పనిచేసుకుంటున్న సిబ్బంది

దండేపల్లి: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల ఆవరణలు హరిత లోగిళ్లగా దర్శనమిస్తున్నాయి. దండేపల్లి, ద్వారక, వెల్గనూర్, గుడిరేవు, రెబ్బనపల్లి, కొర్విచెల్మ జెడ్పీ ఉన్నత పాఠశాలలు, దండేపల్లి కస్తూర్బాగాంధీ విద్యాలయం, కాసిపేట ప్రాథమికోన్నత పాఠశాలల్లో గత ప్రభుత్వాల హయాంతో పాటు, బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన హరిత హారం కార్యక్రమంలో నాటిన చెట్లు వృక్షాలుగా ఎదిగి నీడను, ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. దీంతో పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఉక్కపోత సమయంలో చెట్లనీడన కూర్చుని చదవడం వ్రాయడం చేస్తుంటారు. దండేపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయ ఆవరణలో నాటిన మొక్కలు వృక్షాలుగా మారాయి. పండ్ల చెట్లు పండ్లను ఇవ్వడంతో పాటు చల్లని నీడను అందిస్తున్నాయి. కార్యాలయ సిబ్బంది, విద్యుత్ సిబ్బంది కార్యాలయం కంటే ఎక్కువ చెట్లనీడనే ఉండి తమతమ పనులు చేసుకోవడం గమనార్హం.


దండేపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయాన్ని కమ్మేసిన పచ్చదనం